క్లుప్తంగా

22న వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో గల వీరాంజనేయస్వామి వారి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 22వ తేదీన ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ వారు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద దాతల సాయంతో భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు కమిటీ వారు పేర్కొన్నారు.

మోదమాంబ పాదాలకు జలాభిషేకం


జలాభిషేకం చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : మాడుగుల సతకంపట్టు వద్ద గల మోదమాంబ పాదాల వద్ద మంగళవారం జలాభిషేకం నిర్వహించారు. ఆలయంలో గల పాదాలు వద్ద మాలాధారణ భక్తులు సారధ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.జె.పురం మోదమాంబ ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

మాడుగుల రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన వల్ల మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం వల్ల ఖరీఫ్ వరి నారు మడులను రైతులు సిద్ధం చేస్తున్నారు. ఈ వర్షం వల్ల చెరకు కార్సి తోటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొన్నారు.

పిండ్రంగిలో పైడితల్లమ్మ పండగ

కె.కోటపాడు : పిండ్రంగి గ్రామస్తుల గ్రామదేవత పైడితల్లమ్మ అమ్మవారి పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరిపారు. ఆలయంలో పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు బారులు తీరారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మోదమాంబను దర్శించుకున్న నాయకులు


ఎం. కోడూరు మోదమాంబను దర్శించుకున్న సతీష్‌వర్మ, తదితరులు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామ ఆరాధ్య దైవం, మోదకొండమ్మ అమ్మవారిని పలువురు భక్తులు, నాయకులు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, నాయకులు పిన్నంరాజు సతీష్‌వర్మ, కొయ్య ప్రసాద రెడ్డి, సూరిబాబు దర్శించుకున్నారు.

వారపు సంతకు వర్షం అడ్డంకి

మాకవరపాలెం: తుపాను కారణంగా కురిసిన వర్షం వారపు సంతకు అడ్డంకిగా మారింది. మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురుస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో జరిగిన వారపు సంతకు వర్షం అడ్డంకిగా మారింది. వర్షానికి వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. దుకాణాలు తడిసి పోకుండా తార్పాలిన్లతో రక్షణ ఏర్పాటు చేసుకున్నారు. వర్షం తగ్గిన అనంతరం వచ్చిన కొనుగోలు దారులు బురదమయంగా మారిన మార్కెట్‌లో ఇబ్బందులు పడాల్సివచ్చింది.

చెరువు పనులు ఇలాగేనా..

రోలుగుంట : కోమరవోలు గ్రామం గైరమ్మ చెరువులో అస్తవ్యస్తంగా జరుగుతున్న ఉపాధి పనులపై గ్రామానికి చెందిన రైతు నాయకుడు పోతల శ్రీను మంగళవారం ఎంపీడీవో నాగేశ్వరరావుకి ఫిర్యాదు చేశారు. వాస్తవంగా ఉపాధి పనులతో చెరువును అభివృద్ధి చేసి ఆయకట్టుకు నీరు పారేలా చూడాలని, అయితే ఇందుకు భిన్నంగా తవ్విన మట్టిని చెరువు గర్భంలోనే వేస్తున్నారని, దీనివల్ల పూడిక పేరుకుపోతుందని నిధులు వృధా అవుతున్నాయని తెలిపారు. పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కప్పబడిన చెరువు గర్భంలో మట్టిని తీయించి ఆయకట్టు భూమిలోకి నీరు పోయే విధంగా పనులు జరిపించాలని కోరారు.

నీతి కథలతో విజ్ఞానం

నర్సీపట్నం: నీతి కథలు చదవటం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని గ్రంథాలయ అధికారిణి పి.ధమయంతి విద్యార్థులకు సూచించారు. సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా మంగళవారం విద్యార్థులకు నీతికథలు బోధించారు. వారితో నీతి కథలు చదివించారు. ప్రపంచ తేనెటీగల దినోత్సవం గురించి విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ వివరించారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు బి.ఎస్.ప్రసాద్ ప్రముఖ వ్యక్తుల జీవిత చరిత్రల గురించి వివరించారు.


రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


బుచ్చింపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆస్పత్రుల పునర్విభజన.. అస్తవ్యస్తం

రెండు పీహెచ్‌సీల పరిధిలోని కొన్ని గ్రామాలు నాలుగు మండలాల్లో విలీనం

రోగులకు, సిబ్బందికి ఎంతో అసౌకర్యం

వ్యతిరేకిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

రోలుగుంట : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పునర్విభజన ప్రక్రియ అస్తవ్యస్తంగా తయారైంది. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండా కార్యాలయాలకే పరిమితమయ్యారు. దీంతో సిబ్బందికి, సేవలు పొందే రోగులకు ఇబ్బందికరంగా తయారైందని రోగులు, ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దశాబ్దం క్రితం సుమారు 40 వేలు పైబడి జనాభా కలిగిన ఈ మండలంలో 21 పంచాయతీలుండేవి. వీరందరికీ మండల కేంద్రం రోలుగుంట ఆరోగ్య కేంద్రం ఒక్కటే ఉండేది. ఇద్దరు వైద్యులు, సిబ్బందితో రోగులకు సేవలందేవి. ఫీల్డ్ సిబ్బంది గ్రామాల్లో వైద్య సేవలు విస్తృత పరిచేవారు. తరువాత ఏడాదికేడాది జనాభా పెరిగింది. దీంతో స్థానిక నాయకుల అభ్యర్థన మేరకు అధికారులు స్పందించి సుమారు ఎనిమిదేళ్ల క్రితం బుచ్చింపేట పంచాయతీలో దాతలు ఇచ్చిన భూమిలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జనాభా 50 వేలుపైబడి ఉన్నారు. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు చొప్పున రెండు పీహెచ్‌సీల్లోను నలుగురు వైద్యులున్నారు. రెండు పీహెచ్‌సీల్లోను 24 గంటల సేవలు అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఈ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ, అనాలోచిత ప్రతిపాదనలు కారణంగా ఈ రెండు పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న సిబ్బందిని కొన్ని గ్రామాలను ఒక మండలానికి, మరికొన్ని గ్రామాలను మరొక మండలనికి పునర్విభజన చేసి అస్తవ్యస్తం చేశారు.

రోలుగుంట పీహెచ్‌సీ పరిధిలో ఉన్న జె.నాయుడుపాలెం, గుండుబాడు పంచాయతీలను నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీలో విలీనం చేశారు. అలాగే కుసుర్లపూడి ,జానకిరాంపురం గ్రామాలను మాకవరపాలెం మండల కేంద్రం పీహెచ్‌సీలో చేర్చారు. అలాగే అడ్డసరం,దిబ్బలపాలెం గ్రామాలను రావికమతం మండలం కొత్తకోట పీహెచ్‌సీలో కలిపారు. నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామాన్ని రోలుగుంట పీహెచ్‌సీలో కలిపారు. బుచ్చింపేట పీహెచ్‌సీ పరిధిలో గల సింగరాజుపేట, పెదపేట, ఎం.పెదపేట, చటర్జీపురం గ్రామాలను అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం డౌనూను ఆరోగ్యకేంద్రంలో విలీనం చేశారు. దీనిపై గత నెలలో జరిగిన మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తూ పునర్విభజనపై పునరాలోచన చేసి పాత పద్ధతిలోనే ఆయా గ్రామాలను రోలుగుంట, బుచ్చింపేట పీహెచ్‌సీల్లోకి మార్చాలని కోరారు.

పాత పద్ధతిలోనే రోలుగుంట పీహెచ్‌సీలోనే ఉంచాలి



గతంలో కుసుర్లపూడి, జానకీరాంపురం గ్రామాల్లో రోగుల సేవలు మాకవరపాలెం నుంచి రోలుగుంట పీహెచ్‌సీకి బదలాయించాలి. తమ గ్రామాలు రోలుగుంట మండలంలో ఉన్నాయి కాబట్టి, రోలుగుంట పీహెచ్‌సీలోకి మారిస్తే రోగులకు, వైద్య సిబ్బందికి అనుకూలంగా ఉంటుంది.

– లగుడు కృష్ణంనాయుడు, సర్పంచ్, జానకీరాంపురం

పునర్విభజనతో రోగులకు అసౌకర్యం



తమ గ్రామానికి చెందిన పీహెచ్‌సీ పరిధిలో గల సింగరాజుపేట, పెదపేట, ఎం.పెదపేట, చటర్జీపురం గ్రామాలను కొయ్యూరు మండలం నుంచి తిరిగి మారిస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.

–ఉలబాల సత్యవతి, ఎంపీటీసీ, బుచ్చింపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను..



పొరుగు మండలాలకు పునర్విభజన జరిగిన గ్రామాలను తిరిగి రోలుగుంట, బుచ్చింపేట పీహెచ్‌సీల్లో చేర్పించాలని మండల సమావేశంలో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదించాను.

-యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ, రోలుగుంట మండలం

లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు : కేంద్రంలో గల బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గండి నాయినిబాబు డిమాండ్ చేశారు. కె.కోటపాడులో మంగళవారం నిరసన ర్యాలీ జరిపారు. స్కీమ్ వర్కర్‌లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ముఠా బిల్డింగ్, ఆటో మోటార్ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ సిఫార్సులను అనుసరించి మద్దతు ధరలను కల్పించాలన్నారు. అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి భవానీ, పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు దుర్గారావు, సీపీఎం నాయకులు ముత్యాలనాయుడు, దేముడు, నాయుడుబాబు పాల్గొన్నారు.

సత్తిబాబు సేవలు చిరస్మరణీయం


సత్తిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయు, ప్రజా సంఘాల నాయకులు


నర్సీపట్నం: కామ్రేడ్ డి.సత్తిబాబు ద్వితీయ వర్ధంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు జి.కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులు డి.అమర్, ఎల్.గౌరి, ఆర్‌కే నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సత్తిబాబు సీఐటీయు నాయకుడుగా ప్రజా సమస్యలపై పని చేశారని కొనియాడారు. సీపీఎం నిర్మాణానికి ఎంతో కృషి చేశారన్నారు. జనవిజ్ఞాన వేదిక నాయకుడు కె.త్రిమూర్తులరెడ్డి, యుటీఎఫ్ సీనియర్ నాయకులు ఎం.చిట్టియ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆర్.రమణమ్మ, సామ్రాజ్యం, వరలక్ష్మి, ఆశా నాయకులు అరుణ, మిడ్డేమీల్ నాయకులు కె.ప్రసన్న, ఐద్వా నాయకులు సూర్యప్రభ, సీఐటీయు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

‘అన్నదాత సుఖీభవ’కు రైతు ఆధార్ 1-బి పత్రాలు ఇవ్వాలి


కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు : రైతులకు పంట పెట్టుబడి సహాయం కింద రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన రైతులకు గుర్తించేందుకు రైతు సేవా కేంద్రాల్లో వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతున్నట్టు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం మండలంలో గల 22 గ్రామ రైతు సేవా కేంద్రాల్లోనూ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని మంగళవారం ఆయన కె.సంతపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ కె.కోటపాడు మండలంలో 22 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ పథకానికి సంబంధించి 19,387 మంది రైతుల వివరాలు వ్యవసాయశాఖ సహాయకుల లాగిన్‌లకు వచ్చినట్టు తెలిపారు. రైతులు వారి ఆధార్, 1-బి పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో గల వ్యవసాయశాఖ సహాయకులను సంప్రదించాలని తెలిపారు. భూ వివరాలు ఆధార్ నంబర్‌తో జత అయి ఉంటే వెంటనే వారి వివరాలకు వ్యవసాయశాఖ సహాయకులు అప్రూవల్ ఇవ్వనున్నట్టు తెలిపారు. 1-బి వివరాలు, రైతు ఆధార్ అనుసంధానం కాకపోతే మరలా వ్యవసాయశాఖ సహాయకులు రెవెన్యూ అధికారులకు పంపించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకూ మండలంలో 22 రైతు సేవా కేంద్రాల్లోను 9500 మంది రైతుల వివరాలను అప్రూవల్ చేయడం జరిగిందన్నారు.

మోదకొండమ్మ ఉత్సవ కమిటీకి దరఖాస్తుల ఆహ్వానం


ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు

మాడుగుల: మోదకొండమ్మ ఉత్సవ కమిటీ దరఖాస్తులు 20 వ తేదీ 4 గంటల నుంచి తీసుకోవడం జరుగుతుందని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 21వ తేదీ ఒంటి గంటలోపు తమ ఆధార్ కార్డు జతచేసి దరఖాస్తు అందజేస్తే అదే రోజు నాలుగు గంటలకు డ్రా పద్ధతిలో కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. మాడుగుల పట్టణానికి చెందినవారు మాత్రమే దరఖాస్తుకు అర్హులన్నా రు. ఈ ఉత్సవ కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుందన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు ఉన్నారు.

50 శాతం ఫీజు రాయితీతో విద్య

మాకవరపాలెం : లయన్స్ క్లబ్ నర్సీపట్నం-నవ్య సౌజన్యంతో విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీతో విద్య అందించనున్నట్టు క్లబ్ కార్యదర్శి చైతన్య, అధ్యక్షుడు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న మాంటిస్సోరి పాఠశాలను ఎంపిక చేశామన్నారు. ఈ పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 50 శాతం ఫీజు రాయితీలో విద్య అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాతంలో ఉన్న పేద విద్యార్థులకు తక్కువ ఫీజులతో విద్య అందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 30 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

1702 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదనలు

నాతవరం: ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరాఫరా చేసేందుకు వరి విత్తనాలు 1702 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపించామని నాతవరం వ్యవసాయాధికారి శైలజ అన్నారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఖరీఫ్ సీజన్ సకాలంలోనే ప్రారంభం అవుతుందన్నారు. అందువల్ల రైతులకు ముందుగానే వరి విత్తనాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆర్‌జీఎల్ 2537 రకం విత్తనాలు 850 క్వింటాళ్లు, ఎంటీయు 1064 రకం 761, ఎంటీయు 1061 రకం 72, ఎంటీయు 1318 రకం కేవలం 9 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 20 క్వింటాళ్ల అవసరమని ప్రతిపాదనలు చేశామన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నర్సీపట్నం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని కార్య నిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ వై.జంక్షన్‌కు సమీపంలో ఉచిత కంప్యూటర్ శిక్షణకేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉచిత భోజనంతో పాటు శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు యువతి, యువకులకు 76 రోజులు శిక్షణ ఉంటుందన్నారు.

అఖిల భారత సమ్మెను విజయవంతం చేయండి


వడ్డాదిలో ర్యాలీలో పాల్గొన్న స్కీం వర్కర్స్

బుచ్చెయ్యపేట :సమస్యల పరిష్కారానికి జూన్ 9వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు మండల నాయకుడు ఎస్.వి.నాయుడు పిలుపు నిచ్చారు. మంగళవారం వడ్డాదిలో పలు స్కీం వర్కర్స్‌తో ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. స్కీం వర్కర్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని,లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని,కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినాదాలు చేశారు.

హెచ్ఐవీపై వీధి నాటకం

నర్సీపట్నం: జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో వై.వెంకటేశ్వర కళాబృందం నర్సీపట్నం టౌన్ అబిద్‌సెంటర్‌లో మంగళవారం హెచ్ఐవీపై నాటకం ప్రదర్శించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది. సుఖ వ్యాధులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సమిద స్వచ్ఛంద సిబ్బంది వీరభద్రరావు, ప్రాజెక్టు మేనేజర్ వరహాలుబాబు, సంధ్యారాణి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బుచ్చయ్యపేట : స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం వడ్డాది గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ, 18,160 స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పరిహారం తేలాకే భూ సర్వే చేయాలి

తహసీల్దార్‌కు రైతుల స్పష్టీకరణ


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

రావికమతం : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి బ్యాలెన్స్ రిజర్వాయర్ ఏర్పాటుకు సంబంధించి, సర్వేకు సంబంధించి, రెండో రోజు మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ పైలా రాజు తదితరులతో పాటు తోటకూర పాలెం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో పాటు ఎంపీపీ పైల రాజు మాట్లాడుతూ తమకు డీపీఆర్ ఎక్కడ నుంచి ఎక్కడ వరకూ ఎన్ని భూములు తీసుకుంటున్నదీ ముందుగా తెలియజేయాలని కోరారు. గ్రామంలోకి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులతో కలిసి సమీక్షలు నిర్వహించి, భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం, ఉపాధికి స్పష్టమైన హామీ ఇవ్వాలని, అప్పుడే తమ భూములు సర్వే చేయడానికి అంగీకరిస్తామని తహసీల్దార్‌కు స్పష్టం చేశారు.

వైస్ ఎంపీపీ విజయలక్ష్మికి ఘన సత్కారం


వైస్ ఎంపీపీ విజయలక్ష్మిని సత్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు


విజయలక్ష్మిని సత్కరిస్తున్న ఎంపీపీ రాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ, ఎంపీటీసీలు

మాడుగుల : వైస్ ఎంపీపీ-1గా ఎన్నికైన పొలిమేర విజయలక్ష్మి మంగళవారం ఉదయం తారువా వెళ్లి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడును కలిశారు. ఆయన దుశ్శాలువా కప్పి ఆమెను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం నూతనంగా ఎంపికైన వైస్ ఎంపీపీ విజయలక్ష్మి దంపతులను దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకటరాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ-2 కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ వరహాలు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు మహేశ్వరి, సూర్యకాంతం, అప్పారావు, రమణబాబు, సత్యవతి, నాగరత్నం, ఆర్లి మాధవి, నూకరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు హేమంత్ కుమార్, నాగశంకర్, కృష్ణమూర్తి, అప్పలనాయుడు, కాత రమణ పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షుడు అప్పారావు

దేవరాపల్లి: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు పరచాలని మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్ చేసింది. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద మంగళవారం అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు. నక్కపల్లి మండలం డొంకాడలో ఎనిమిది మంది దళిత యువకులను చోరీకి పాల్పడ్డారన్న నెపంతో విచక్షణారహితంగా కొట్టి కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ప్రజా సంఘాలు, దళిత ఐక్య ఉద్యమాలతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం నాయకులు కార్లి సాయి సుందరరావు, నాగభూషణం, మాలిబాబు, రామారావు, కన్నాబత్తుల రాజు, సంతోష్, మహేష్ పాల్గొన్నారు.

ఆదివాసీల కన్వెన్షన్ విజయవంతం చేయండి


కన్వెన్షన్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారావు, పార్టీ నాయకులు

నర్సీపట్నం: ఈ నెల 31న అనకాపల్లిలో జరిగే ఆదివాసీల రాష్ట్ర కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారావు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన కన్వెన్షన్ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలు సాధించుకున్న రాజ్యాంగ, చట్టబద్ధ హక్కులను హరిస్తున్నాయన్నారు. ప్రభుత్వాల విధానాలను ఎండగట్టేందుకు కన్వెన్షన్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కార్యదర్శి ఎస్.గణేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు జనార్దన్ పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి


ఆంధ్రకేసరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు

నర్సీపట్నం: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పెదబొడ్డేపల్లి వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర కేసరిగా కీర్తిప్రతిష్ఠలు పొందిన ఆ మహనీయుడు మనందరికీ స్ఫూర్తి ప్రదాత అని చైర్‌పర్సన్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ఏకా శివ, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ నాయకులు తమరాన శ్రీను, పెట్ల అప్పలనాయుడు, బేతిరెడ్డి విజయ్ పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మె జూలై 9కి వాయిదా



సమ్మె గోడ పత్రిక విడుదల చేస్తున్న దృశ్యం

చీడికాడ: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు నిరసనగా సీఐటీయు ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సమ్మెను జూలై 9వ తేదికి వాయిదా పడినట్లు సీఐటీయు మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు కోరారు. చీడికాడలో మంగళవారం కార్మికులతో కూడి నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం 4 కోడ్స్‌గా మార్చి కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగించిందన్నారు.ఈ లేబర్‌కోడ్స్ రద్దు, కనీస వేతనాలు అమలు తదితర అంశాలపై సమ్మె నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


దేవరాపల్లిలో ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు

దేవరాపల్లి: దేవరాపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దేవరాపల్లి ప్రధాన రహదారుల్లోని దుకాణదారులకు, ప్రజలకు ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత , త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలనే ముఖ్య ఉద్దేశ్యంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు త్రినాథరావు కృష్ణ సూరప్పడు, సురేష్, పైడన్న, సత్యం, భవానీ పాల్గొన్నారు.

కింతలిలో పైడితల్లమ్మ పండగ

మాడుగుల: కింతలి గ్రామంలో మంగళవారం పైడితల్లమ్మ పండగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు నెత్తిన పెట్టుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ మైచర్ల భవానీ, సన్యాసిరావు,సుంకర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిశోర బాలికలు చైతన్యవంతులు కావాలి


మాట్లాడుతున్న ఆర్జేడీ చిన్మయిదేవి

నర్సీపట్నం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొత్తవీధి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న సమ్మర్ స్పెషల్ అవేర్నెస్ క్యాంప్‌ను ఆర్జేడీ చిన్మయిదేవి మంగళవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు చైతన్యవంతులు కావాలనే సంకల్పంతో ప్రభుత్వం అవేర్నెస్ క్యాంప్ నిర్వహిస్తోందన్నారు. కిశోర దశలో పోషణపై దృష్టి పెట్టాలన్నారు. బాల్య వివాహాలతో అనర్థాల గురించి, బాలికల హక్కులు, బాలికల పోషణ, రక్షణ గురించి నేర్చుకున్న అంశాల గురించి కిశోర బాలికలను అడిగి తెలుసుకున్నారు.